వేర్వేరుగా సన్న, దొడ్డు రకాల ధాన్యం సేకరణ

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: వానాకాలం ధాన్యం సేకరణను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం ఆయన సమీకృత పాలనా ప్రాంగణంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, గన్నీ సంచులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే యంత్రాలు, తూకం వేసే యంత్రాలు సమకూర్చుకోవాలని సూచించారు. దొడ్డు, సన్న రకాల ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. మంగళవారం ఆయన రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3-6 ఏళ్లలోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యా బోధనపై వచ్చే నెలలో సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధులు రాహుల్, అజీమ్‌ప్రేమ్‌జీ సంస్థ సభ్యులు శ్రీనివాస్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

15న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ప్రారంభం

మంచిర్యాల, వరంగల్ జిల్లాల మధ్య నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం పనులు నవంబరు 15న ప్రారంభం కానున్నాయని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి మంగళవారం నిర్వహించిన దూరదృశ్య మాధ్యమ సమీక్షకు ఆయన హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమై ఇప్పటివరకు సేకరించిన భూములను ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. పెండింగ్ భూ సేకరణలో వేగం పెంచాలని ఆదేశించారు.

దుమారం రేపిన హత్య

- ఘటనను నిరసిస్తూ రహదారిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బైఠాయింపు
- జగిత్యాలలో 4 గంటలపాటు ఆందోళన


ఘటనా స్థలంలో గంగారెడ్డి ద్విచక్రవాహనం, నిందితుడి కారు

న్యూస్‌టుడే, జగిత్యాల, జగిత్యాల గ్రామీణం

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, జగిత్యాల గ్రామీణ మండలం జాబితాపూర్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు మారు గంగారెడ్డి హత్య పెను దుమారం లేపింది. గంగారెడ్డి హత్యకు వ్యక్తిగత కక్షలు ఉన్నప్పటికీ రాజకీయ రంగు పులుముకోవడంతో జగిత్యాలలో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం ఉదయం 8 గంటలకు జాబితాపూర్ గ్రామంలో గంగారెడ్డి అత్యంత దారుణంగా హత్యకు గురికాగా మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తేగానే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. సుమారు 4 గంటలపాటు పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఒక దశలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తీవ్ర అసహనానికి గురయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పార్టీ కోసం కష్టపడ్డ వారికి అవమానాలే మిగులుతున్నాయని ఆవేదన చెందారు. పార్టీ ఫిరాయించిన వ్యక్తి ప్రోద్బలంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పోలీసులు, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లేందుకు వారు సిద్ధపడగా పోలీసులు అడ్డుకున్నారు. జీవన్‌రెడ్డి సైతం కార్యకర్తలను నిలువరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా జీవన్‌రెడ్డి ఓటమి చెందారు. భారాస నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరారు. ఆ సమయంలోనే తీవ్ర నిరాశ చెందిన జీవన్‌రెడ్డిని అధిష్ఠానం బుజ్జగించింది. ఇద్దరు నేతలు విడివిడిగానే కార్యక్రమాల్లో పాల్గొంటుండగా ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో సైతం అయోమయం నెలకొంది. జగిత్యాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మారు గంగారెడ్డి పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మరో పేరు ప్రతిపాదించడంతో పాలకవర్గం నియామకం పెండింగ్‌లో పడినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇందిరమ్మ కమిటీల్లో సభ్యుల పేర్ల విషయంలోనూ ఇదే తీరు ఉందని వారు పేర్కొంటున్నారు. ఏళ్ల నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారి పేర్లు కాకుండా భారాసకు చెందిన వారి పేర్లను ఎమ్మెల్యే ప్రతిపాదిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. తాజాగా గత ఎన్నికల సమయంలో భారాసలో పని చేసిన యువకుడు గంగారెడ్డిని హతమార్చడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. గంగారెడ్డి హత్య నేపథ్యంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆందోళనకు దిగగా, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పార్టీ శ్రేణులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గంగారెడ్డి హత్యను విప్ లక్ష్మణ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని అండగా ఉంటానన్నారు. గంగారెడ్డి హత్యను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఖండించారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.


రోడ్డుపై బైఠాయించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్

హతమార్చి.. లొంగిపోయి

గంగారెడ్డి హత్య కేసులో నిందితుడు సంతోష్ ఘటన తరవాత నేరుగా జగిత్యాల గ్రామీణ ఠాణాకు వెళ్లి లొంగిపోయాడు. అతన్ని పోలీసులు విచారిస్తున్నారు. పలు విషయాల్లో అడ్డు తగలడంతో ఈ చర్యకు పాల్పడ్డట్లు పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. కాగా నిందితుడు లొంగిపోగానే సామాజిక మాధ్యమాల్లో సంతోష్ జగిత్యాల గ్రామీణ పోలీసుస్టేషన్‌లో చిత్రీకరించిన ఓ పాత వీడియో వైరల్‌గా మారడంతో కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.

ఆందోళనలోనూ దేశభక్తిని మరవక...

గంగారెడ్డి హత్యను నిరసిస్తూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో సహా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాత బస్టాండ్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగగా అదే సమయంలో ఉదయం 9.30 గంటలకు నిత్య జనగణమన గీతం మైకులో వినిపించగా ఆందోళన చేస్తున్న వారంతా లేచి నిలబడి వందనం చేస్తూ దేశభక్తిని చాటుకున్నారు.

నోరు తెరిచిన బావి



ధర్మారం మండలం దొంగతుర్తి నుంచి జూలపల్లి మండలం కుమ్మరికుంటకు వెళ్లే రహదారి పక్కన దొంగతుర్తి శివారులో వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. సమీపంలోకి వచ్చే వరకు కనిపించకపోగా, దారి వరకు బావి కూలింది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదానికి గురయ్యే ఆస్కారం ఉంది. రెండేళ్ల కిందట ఈ రహదారి అభివృద్ధికి రూ.4 కోట్ల సీఆర్ఆర్ నిధులు మంజూరైనా ఇప్పటికీ పనులు మొదలు కాలేదు.

- న్యూస్‌టుడే, ధర్మారం

వరద నీటిలో చేపల వేట



పెద్దపల్లి పరిసర ప్రాంతాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువులు, కుంటలు పొంగి పొర్లాయి. పట్టణ పరిధిలోని రంగంపల్లి విద్యుత్తు ఉపకేంద్రం వద్ద వరద ప్రవాహంలో చేపల కోసం వలలు వేసిన మత్స్యకారులను 'న్యూస్‌టుడే' కెమెరాలో బంధించింది.

-న్యూస్‌టుడే, పెద్దపల్లి

చురుగ్గా పనులు... అందుబాటులోకి అత్యవసర చికిత్సలు

రూ.23.75 కోట్లతో ఖనిలో క్రిటికల్ కేర్ సదుపాయం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారితో పాటు అత్యంత క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్న వారికి అత్యాధునిక, అత్యవసర వైద్య సేవలందించి ప్రాణాలను కాపాడేందుకు గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆవరణలో క్రిటికల్‌కేర్ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. టి.జి.ఎం.ఐ.డి.సి. (తెలంగాణ ఆరోగ్య మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో రూ.23.75 కోట్ల వ్యయంతో 50 పడకల సామర్థ్యంతో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల్లో భవన నిర్మాణ పనులను ఆరు నెలల క్రితం చేపట్టగా ప్రస్తుతం వేగవంతంగా సాగుతున్నాయి. జాతీయ రహదారుల వెంట ప్రతి 35 కిలోమీటర్ల దూరంలో ఒక ట్రామా కేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రకటించగా గోదావరిఖనిలో క్రిటికల్ కేర్ భవనంలో ట్రామా కేర్‌తో పాటు వివిధ విభాగాల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఇందుకోసం ఆసుపత్రి ఆవరణలోని అటెండెంట్ల షెడ్డు, కిచెన్ షెడ్డుతో పాటు నీటి ట్యాంకును కూల్చి వేశారు. పక్కనే ఉన్న నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆనుకొని నిర్మాణ పనులను చేపడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో క్రిటికల్‌కేర్ సదుపాయాల కోసం టి.జి.ఎం.ఐ.డి..సి. రూ.23.75 కోట్ల నిధులను కేటాయించగా అందులో రూ.10 కోట్లతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. మిగతా రూ.13.75 కోట్లతో వివిధ విభాగాల్లో అవసరమైన వైద్య సామగ్రిని సమకూర్చనున్నారు.


కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు

తగ్గనున్న దూరాభారం...

రాజీవ్ రహదారిలో నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సాధారణ గాయాలకు గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స చేసి కరీంనగర్, హైదరాబాద్‌కు తరలించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి విషమంగా మారడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. స్థానికంగానే క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తే ప్రమాదబాధితులకు దూర, ఆర్థిక భారం తగ్గడంతో పాటు ప్రాణహాని తప్పే అవకాశముంది. ఇటీవలి కాలంలో రామగుండం ప్రాంతంలో పలువురు గుండెపోటుకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆసుపత్రి ఆవరణలో గుండె వ్యాధుల శస్త్ర చికిత్స కోసం ప్రత్యేకంగా క్యాథ్‌లాబ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని కోసం ఆసుపత్రి అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. స్థానిక పరిశ్రమలు సహకరిస్తే 'ఖని'లో క్యాథ్‌లాబ్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

మెరుగైన వైద్యం అందనుంది

గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవన నిర్మాణం పూర్తయితే అన్ని విభాగాల్లో అత్యవసరమైన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఎంతటి క్లిష్టమైన పరిస్థితుల్లోనైనా తక్షణమే వైద్య సేవలందించే సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఆయా పనులు పూర్తయితే మెరుగైన వైద్యానికి రామగుండం కేంద్రం కానుంది. హైదరాబాద్ తరహా వైద్య సేవలు దశలవారిగా రామగుండంలోనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

రామగుండానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఏడాదిన్నర తర్వాత తరలింపు

న్యూస్‌టుడే, గోదావరిఖని

ఎట్టకేలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రామగుండానికి తరలివస్తుంది. ఏడాదిన్నర కాలంగా పెద్దపల్లిలోనే సేవలందించిన కార్యాలయాన్ని రామగుండంలో బుధవారం ప్రారంభించనున్నారు. రామగుండం ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌పై గత ప్రభుత్వం ఈ ప్రాంతానికి ప్రత్యేకంగా కార్యాలయాన్ని కేటాయించింది. ఈ ప్రాంత భూములు, పెళ్లిళ్లకు పెద్దపల్లికి వెళ్లి రిజిస్ట్రేషన్ సేవలు పొందాల్సి ఉండేది. దీంతో చాలా మంది దూర ప్రాంతంలో ఉన్న కార్యాలయానికి వెళ్లేందుకు ఇబ్బంది ఎదుర్కొన్నారు. పెద్దపల్లిలో ఎక్కువ శాతం రిజిస్ట్రేషన్లన్నీ రామగుండం ప్రాంతానికి చెందినవే ఉండటంతో వెళ్లి రావడానికి ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలోనే గత ఏడాది ఏప్రిల్ 1న పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే తాత్కాలికంగా రామగుండం కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే రామగుండానికి ప్రత్యేకంగా కేటాయించినా ఆయా సేవలకోసం మళ్లీ పెద్దపల్లికి వెళ్లాల్సి వచ్చింది.



నేడు ప్రారంభం

రామగుండం పట్టణంలోని పాత మండల పరిషత్తు కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మండల పరిషత్తు కార్యాలయ భవనానికి మరమ్మతులు చేయించారు. రామగుండం కార్పొరేషన్‌తో పాటు అంతర్గాం, పాలకుర్తి మండలాల ప్రజలకు సేవలు అందుబాటులో ఉంటాయి. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌తో పాటు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రారంభ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఏడాదిన్నర కాలంగా పెద్దపల్లిలోనే సేవలందించిన రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇప్పటి వరకు 8,462 భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేశారు. వీటి ద్వారా రూ.42.45 కోట్ల ఆదాయం సమకూరింది. వివాహాలకు సంబంధించి 1850 రిజిస్ట్రేషన్లు చేశారు. కాగా పారిశ్రామిక ప్రాంతానికి కేంద్రమైన గోదావరిఖని పట్టణ ప్రజలకు మళ్లీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు దూరం కానున్నాయి. గోదావరిఖనిలోనే ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు ఆశించారు. ఈ మేరకే రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. రామగుండం రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలంటే మళ్లీ దూరాభారం తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వర్షాలకు నేలవాలిన వరి


పేరపల్లి వద్ద నేల కొరిగిన వరి పైరు

కమాన్‌పూర్ మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరి పైర్లు నేలవాలాయి. పేరపల్లి, రొంపికుంట, సిద్దిపల్లి, గుండారం, కమాన్‌పూర్ గ్రామాల్లో పొట్ట దశలో ఉన్న వరి నేల వాలడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో 15-20 రోజుల్లో కోతకు వచ్చే పంట సైతం వర్షానికి దెబ్బతింది.

-న్యూస్‌టుడే, కమాన్‌పూర్


రొంపికుంట-సిద్దిపల్లి మధ్యలో..

తనిఖీలు సరే.. రికవరీ ఏదీ!

- ఉపాధిహామీ పనులపై పర్యవేక్షణ లోపం
- అక్రమాలు వెలుగు చూస్తున్నా చర్యలు అంతంతే

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ఉన్న ఊరిలో పని కల్పించేందుకు అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం అక్రమాలతో అభాసుపాలవుతోంది. పర్యవేక్షణ కరవై రూ.లక్షలు పక్కదారి పడుతున్నాయి. మండుటెండలో కష్టించిన కూలీ శ్రమ దోపిడీకి గురవుతోంది. వలసలకు అడ్డుకట్ట వేయడం మాట ఎలాగున్నా అక్రమార్కులతో కుమ్మక్కైన అధికారులు నిధులు స్వాహా చేస్తున్నారు. తనిఖీలపై చూపుతున్న శ్రద్ధ నిధుల రికవరీపై లేకపోవడంతో అక్రమాలు పరిపాటిగా మారాయి.

అవకతవకలతో శ్రమ దోపిడీ

- పనికి వెళ్లని కూలీల పేరిట నిధులు పక్కదారి పడుతున్నాయి.
- కొలతల నమోదులో అవకతవకలతో కూలీల శ్రమలో కోత పడుతోంది.
- కొంతమంది పని చేయకున్నా రికార్డు చేసి వేతనాలు చెల్లిస్తున్నారు.
- నేల స్వభావం గట్టిగా ఉండటంతో వేతనం గిట్టుబాటు కావడం లేదు.
- బోగస్ జాబ్‌కార్డులు సృష్టించి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారు.
- కంప్యూటరులో నమోదు చేసే క్రమంలో జరిగే తప్పులతో వేతనాల్లో హెచ్చుతగ్గులు వస్తున్నాయి.



వేటు పడుతున్నా మారని తీరు

ఉపాధిహామీలో పక్కదారి పట్టిన నిధులను రాబట్టడం అధికారులకు తలకు మించిన భారంగా మారింది. అవినీతి, అవకతవకలకు పాల్పడుతున్న సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నా అక్రమాలు తగ్గడం లేదు. గడిచిన తొమ్మిదేళ్లకు సంబంధించి గణాంకాలు విస్తుపోయేలా చేస్తున్నాయి. జిల్లాలో రూ.83.64 లక్షలు పక్కదారి పట్టగా ఇప్పటివరకు రూ.76.12 లక్షలు మాత్రమే రికవరీ అయ్యాయి. నిబంధనలు కఠినంగా అమలు చేయకపోవడంతో అక్రమార్కులు తిరిగి చెల్లించేందుకు వెనుకాడుతున్నారు.

గత ఆరేళ్లలో జిల్లాలో ఇలా..(రూ.లల్లో)

సంవత్సరం	పక్కదారి పట్టింది	రికవరీ చేసింది
2019	11,74,160	8,74,460
2020	7,52,997	5,51,451
2021	26,42,108	8,01,783
2022	4,03,788	21,05,544*
2023	7,53,021	9,09,033*
2024	3,69,791	3,44,176

*అంతకుముందు బకాయిలతో కలిపి..

పని చేయకున్నా వేతనాలు

జిల్లాలో గత కొన్ని సామాజిక తనిఖీ నివేదికలు పరిశీలిస్తే రామగిరి మండలంలో రూ.1,01,073, కమాన్‌పూర్‌లో రూ.19,722, అంతర్గాంలో రూ.67,082, ముత్తారంలో రూ.43,703, పాలకుర్తిలో రూ.58,476, ఎలిగేడులో రూ.20,202, ధర్మారంలో రూ.1,08,941, జూలపల్లిలో రూ.10,266, కాల్వశ్రీరాంపూర్‌లో రూ.25,351, సుల్తానాబాద్‌లో రూ.33,630, పెద్దపల్లిలో రూ.59,412 చొప్పున నిధులు దుర్వినియోగమయ్యాయి. కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేటలో హాజరు నమోదులో తప్పులతో కూలీలు నష్టపోయారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో పనికి చేయకున్నా కొందరు వేతనాలు పొందారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

పర్యవేక్షణ పెంచుతున్నాం

ఉపాధిహామీ పనులపై పర్యవేక్షణ పెంచుతున్నాం. కూలీల వివరాల నమోదులో పొరపాట్లను సరి చేస్తున్నాం. బోగస్ హాజరు వ్యవహారంపై పర్యవేక్షిస్తున్నాం. తనిఖీల్లో వెలుగుతు చూసిన అవకతవకలకు సంబంధించి నిధుల రికవరీకి చర్యలు తీసుకుంటున్నాం.

-రవీందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

ఖని ట్రాఫిక్ సీఐ బదిలీ

పలువురికి స్థాన చలనం

గోదావరిఖని, న్యూస్‌టుడే: గోదావరిఖని ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న పి.రాజేంద్రప్రసాద్ కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ ఠాణాకు బదిలీ అయ్యారు. ఈమేరకు మల్టీ జోన్-1 ఐజీపీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ పనిచేస్తున్న టి.శంకరయ్యను మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాల్లో పేర్కొన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్‌లో సీసీఆర్‌బీలో సీఐగా పనిచేస్తున్న బుద్దె స్వామిని కుమురంభీం జిల్లా తాండూరు రూరల్ ఠాణాకు, అక్కడ పనిచేస్తున్న ఎన్.చిట్టిబాబును మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాల్లో పేర్కొన్నారు. హైదరాబాద్ ఇంటెలిజెన్సు కార్యాలయంలో పనిచేస్తున్న బుద్దె రవీందర్‌ను ఆసిఫాబాద్ ఠాణాకు, అక్కడ పనిచేస్తున్న జి.సతీష్‌ను మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు.

టాస్క్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెద్దపల్లి టాస్క్ కేంద్రంలో నైపుణ్య శిక్షణ కోసం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో డిగ్రీ ఉత్తీర్ణులైన యువత ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 4 నుంచి తొలి బ్యాచ్ శిక్షణ ప్రారంభమవుతుందని చెప్పారు. వివరాలకు 95333 08928 నెంబరులో సంప్రదించాలన్నారు.

చెంజర్ల గడ్డ.. ఉద్యోగుల అడ్డా

☛ ఒకే ఊరిలో 70 మంది ఉపాధ్యాయులు
☛ ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం

గతంలో కరవు కాటకాలతో సతమతమైన గ్రామం అది. ప్రస్తుతం గురువులకు నిలయంగా మారింది. తలాపున కాకతీయ కాలువ ప్రవహిస్తున్నా ఆ పల్లెకు చుక్క నీరు అందడం లేదు. సాధారణ కుటుంబాలు కావడంతో చదువుతోనే భవిష్యత్తు బాగుపడుతుందని పెద్దలు తలచారు. ముందుగా ఆరుగురు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వారి స్ఫూర్తితో అదే ఉద్యోగాన్ని సాధించాలని మరికొంత మంది దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. ప్రస్తుతం ఒక తరాన్ని ప్రభావితం చేయగలిగిన గురువులు ఈ ఊరి సొంతం. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 70 మంది ఉపాధ్యాయులు ఆ గ్రామంలో ఉండడం విశేషం.
- న్యూస్‌టుడే, మానకొండూర్


చెంజర్ల గ్రామం

మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామంలో 3,067 మంది జనాభా ఉంది. నీటి సదుపాయం లేకపోవడంతో ఆశించిన మేర వ్యవసాయం సాగలేదు. దీంతో పలు కుటుంబాలు జీవనోపాధి కోసం ముంబయి, బీవండి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ క్రమంలోనే తమ భవిష్యత్తుపై ఆందోళన చెందిన స్థానిక యువత.. చదువుపై దృష్టి సారించింది. మొక్కవోని దీక్షతో.. ఉజ్వల భవిష్యత్తుపై ఆశతో.. ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువులు కొనసాగించారు. 2006 డీఎస్సీలో గ్రామం నుంచి ఒక్కసారే ఆరుగురు ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. ఈ పరిణామం గ్రామంలోని పలువురిని ఉపాధ్యాయ వృత్తి వైపు మళ్లించేలా చేసింది. వారి ఆసక్తికి.. స్థానిక ప్రైవేట్ ఉపాధ్యాయుడు ఆంజనేయులు, మార్కండేయ, శ్రీనివాస్‌ల ప్రోత్సాహం తోడైంది. వారు ఇచ్చిన సూచనలను సద్వినియోగం చేసుకున్న 18 మంది అభ్యర్థులు 2012 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికై అరుదైన ఘనత సాధించారు. ఒకే గ్రామం నుంచి అంత మంది ఉద్యోగానికి ఎంపికైన దాఖలాలు రాష్ట్ర చరిత్రలోనే లేవు. అదే స్ఫూర్తితో ప్రతీసారి ఈ గ్రామం నుంచి ఉపాధ్యాయులుగా ఎంపిక అవుతూనే ఉన్నారు. తాజా డీఎస్సీలోనూ ఒక్క పీఈటీ, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ఆరుగురు ఎస్జీటీలు ఎంపికవడం గమనార్హం. వీరితోపాటు గ్రామంలో 17 మంది కానిస్టేబుళ్లతోసహా ఇతర విభాగాల్లోనూ ఉద్యోగులు ఉండటం విశేషం.

వృత్తిపై మమకారం



ప్రాథమిక విద్య నుంచే ఉపాధ్యాయ వృత్తిపై మమకారం పెరిగింది. ఉపాధ్యాయుడిగా ఎంపికైతే పలువురిని ప్రయోజకులుగా తయారు చేయాలని ఉండేది. 2012 టెట్‌లో రాష్ట్రస్థాయిలో 1వ ర్యాంక్ సాధించాను. స్కూల్ అసిస్టెంటుగా ఎంపిక కావడం ఎంతో సంతోషం కలిగించింది. ఇటీవల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఆంగ్ల అధ్యాపకుడిగా ఎంపికయ్యాను. టెటీచ తరగతులు నిర్వహిస్తూ ఉపాధ్యాయ వృత్తిలోకి ఎంపికయ్యేలా సహాయం చేస్తున్నాను.
- బైరి మార్కండేయ, జూనియర్ లెక్చరర్

సీనియర్ల స్ఫూర్తితో..



సీనియర్ ఉపాధ్యాయుల స్ఫూర్తితో నేను కూడా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివాను. బీఈడీ పూర్తి చేసి అనుకున్నది సాధించాను. కొన్నాళ్లపాటు మా గ్రామంలోని ఉన్నత పాఠశాలలోనే పని చేయడం ఎంతో సంతృప్తిని కలిగించింది. నా భార్య కూడా ఉపాధ్యాయురాలే. ఎవరైనా ఏదైనా అనుకుంటే అది సాధించే వరకు ప్రయత్నిస్తూ ముందుకు సాగాలి.
- దాసరి శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్

మొదటి ప్రయత్నంలోనే..



నేను మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవడానికి కారణం మా గ్రామమే. ఇంత మంది గురువులను చూసి అందులో నేనూ ఒకరిని కావాలని అనుకొని ఆ దిశగా ప్రయత్నం చేశాను. ఆత్మవిశ్వాసం కోల్పోయిన ప్రతిసారి నన్ను స్నేహితులు ప్రోత్సహించారు. చివరకు ఇటీవలి ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికవడం సంతోషాన్నిచ్చింది.
- బుర్ర శ్రీనివాస్, ఎస్జీటీ

గ్రామంలో ఉద్యోగుల సంఖ్య ఇలా..

★ మొత్తం ఉపాధ్యాయులు 70 (వీరిలో అయిదుగురు విశ్రాంత ఉపాధ్యాయులుండగా.. మరో ఇద్దరు చనిపోయారు.)
★ కానిస్టేబుళ్లు 17 ★ ఆర్టీసీ కండక్టర్లు 5 ★ పంచాయతీ కార్యదర్శులు 3 ★ సింగరేణి సంస్థలో.. 3 ★ జూనియర్ అసిస్టెంట్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ 2
★ టెక్నికల్ అసిస్టెంట్, ఐఐటీ మద్రాస్ 1 ★ ట్రాన్స్‌కో ఏడీఈ (అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్) 1 ★ ఆర్ఐ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ 1 ★ పోస్ట్‌మెన్ 1
★ జూనియర్ అసిస్టెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ 1 ★ జూనియర్ అసిస్టెంట్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్ 1 ★ ఆర్టీసీ మెకానిక్ 1

అమ్మ భాషలో ఆణిముత్యాలు

తెలుగులో డాక్టరేట్ సాధించిన అక్కాచెల్లెళ్లు

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం


శ్రీనివాస్‌తో కుమార్తెలు శరణ్య, హర్షిత

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీలేదని నిరూపిస్తున్నారు ఈ అక్కాచెల్లెళ్లు. తండ్రి ఆశయం మేరకు తెలుగు భాషపై మక్కువ పెంచుకున్న వీరు ఒకేసారి డాక్టరేట్ సాధించి ప్రశంసలు అందుకుంటున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని బుఖ్యవాడకు చెందిన వైద్యుడు వేముల శ్రీనివాస్-సాయిసుధ దంపతుల కుమార్తెలు శరణ్య, హర్షితకు చిన్నప్పటి నుంచే తెలుగు భాషపై మక్కువ. హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు ఫస్ట్ ర్యాంకర్లుగా నిలిచి శరణ్య, హర్షిత బంగారు పతకాలు సాధించారు. ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా తెలుగులో ఒకేసారి డాక్టరేట్ అందుకున్నారు. డిగ్రీ కళాశాల అధ్యాపకురాళ్లుగా ఒకేసారి ఉద్యోగాలు సాధించిన వీరు ప్రొఫెసర్లు కావడమే తమ లక్ష్యమంటున్నారు.

శరణ్య 1 నుంచి 10వ తరగతి వరకు మెట్‌పల్లిలో, ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివి 5 ఏళ్ల పాటు మెరిట్ ర్యాంక్ సాధించారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో మొదటి స్థానం సాధించి మెరిట్ బంగారు పతకం, డిగ్రీ స్థాయిలో సంస్కృతంలో అత్యధిక మార్కులు పొంది రెండో బంగారు పతకం సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో నాలుగు సెమిస్టర్లలో మొదటి స్థానంలో నిలిచి విశ్వవిద్యాలయం పరిధిలో టాపర్‌గా నిలిచి 2018లో అప్పటి గవర్నర్ చేతుల మీదుగా మెరిట్ బంగారు పతకం అందుకున్నారు. తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రి రాములు వద్ద శ్రీనాథుని కవితా ప్రస్థానం సమగ్ర పరిశీలన అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేయడంతోపాటు కవితలు, పాటలు రాసి అవార్డులు అందుకున్నారు. పలు టీవీ ఛానళ్లలో తెలుగుపై చర్చా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. 2019లో తెలంగాణ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించిన ఆమె ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా తెలుగులో డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

హర్షిత 10వ తరగతి వరకు మెట్‌పల్లిలో చదివి మండల టాపర్‌గా నిలిచి ఐఐటీ బాసరలో సీటు సాధించారు. తెలుగు భాషపై మక్కువతో ఐఐటీ సీటును వదిలేసి అక్క నడిచిన మార్గంలోనే ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివి టాపర్‌గా నిలిచారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో నాలుగు సెమిస్టర్లలో టాపర్‌గా నిలిచి 2016లో మూడు మెరిట్ మెడల్స్‌ని కైవసం చేసుకున్నారు. అదే విశ్వవిద్యాలయంలో సాహిత్య వ్యాసాల విమర్శనాత్మక అధ్యయనం అనే అంశంపై ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు వద్ద పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2019లో తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించిన ఆమె తాజాగా తెలుగులో గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా తీసుకున్నారు.

ఆర్టీఏలో పొరుగు సేవల సిబ్బందిపై వేటు

న్యూస్‌టుడే - కరీంనగర్ రవాణావిభాగం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రవాణా శాఖ కార్యాలయాల్లో పని చేసే కొందరు డీబీఏలపై (డాటా బేస్డ్ ఎంట్రీ ఆపరేటర్స్, ప్రస్తుతం వీరిని టెక్నికల్స్ సపోర్ట్ ఇంజినీర్స్ అని పిలుస్తున్నారు) వేటుకు రంగం సిద్ధమైంది. కొన్నేళ్లుగా ఆర్టీఏ కార్యాలయాల్లో పని చేసే ఈ సిబ్బందిపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో దశల వారీగా వీరికి ఉద్వాసన పలకాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది.

వీరిది కీలకపాత్ర...

రవాణా శాఖ కార్యాలయాల్లో అవుట్‌సోర్సింగ్ ద్వారా నియామకమైన డీబీఏలు కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. ఆ శాఖకు సంబంధించిన సమాచారాన్ని కంప్యూటర్లలో నిక్షిప్తం చేయడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల ముద్రణ తదితర పనులు వీరే చూసుకుంటున్నారు. కొన్ని కార్యాలయాల్లో అధికారులు లేకపోయినా పనులు చక్కబెడుతున్నారు. ఈక్రమంలో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆరోపణలు వచ్చిన వారిని తొలగించాలని సర్కారు నిర్ణయించింది. కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో పనిచేసే మురళీకృష్ణపై వేటుపడింది. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఉమ్మడి జిల్లా ఉప రవాణా కమిషనర్ పెద్దింటి పురుషోత్తంను వివరణ కోరగా నిజమేనని ధ్రువీకరించారు.

అందరిలో ఆందోళన..

ఉమ్మడి జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందిలో ఎప్పుడు ఎవరిపై వేటు పడుతుందోననే భయాందోళనలో ఉన్నారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఇటీవలే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కూడా కలిసి డీబీఏ ఉద్యోగులు విన్నవించినట్లు తెలిసింది.

సన్నాల కొనుగోళ్లలో నూతన విధానానికి శ్రీకారం

నిబంధనలకు లోబడి ఉంటేనే ధాన్యానికి రూ.500 బోనస్

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్


గ్రెయిన్ కాలిపర్ పరికరం

రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 ఇస్తామని ప్రకటించడంతో ధాన్యం సేకరణ నాణ్యత, నిర్ధారణలో నిబంధనలు కఠినతరం చేసింది. పొరపాట్లు జరగకుండా సన్న రకాలను కొనుగోలు చేసేందుకు తొలిసారిగా సాంకేతిక విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్షేత్రంలోకి దిగిన అధికార యంత్రాంగం రైతులను చైతన్యం చేసే పనిలో నిమగ్నమైంది

ప్రత్యేక పరికరంతో పరిశీలన

ధాన్యం నాణ్యత విషయంలో పౌరసరఫరాల శాఖ ఇప్పటి వరకు దొడ్డు, సన్న నిర్ధారణ ప్రమాణాలు పాటించకుండానే వడ్లను కొనుగోలు చేస్తోంది. ఏఈవోలు 'ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ' పరికరంతో దొడ్డు, సన్న రకాలు గుర్తించకుండా తేమ, తాలు, రాళ్లు, రప్పలు తదితర ప్రమాణాల శాతాన్ని పరిశీలించి చేతులు దులుపుకొంటున్నారు. చాలా చోట్ల ఏఈవోలు నామమాత్రంగానే ధాన్యం సేకరణలో భాగస్వామ్యం అవుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. పని ఒత్తిడి భారంతో కేంద్రాలకు వెళ్లకుండానే ధాన్యం కొనుగోళ్లకు అనుమతులు ఇస్తున్నారు. మద్దతు ధర తప్పితే సన్న వడ్ల గుర్తింపుపై ఇప్పటివరకు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలులో గ్రెయిన్ కాలిపర్(డయల్ మైక్రోమీటర్) పరికరాన్ని వినియోగించనున్నారు. వీటి కొనుగోలు బాధ్యతను మార్కెటింగ్ శాఖ తీసుకొంది. గింజ పొడవు, వెడల్పు కొలిచేందుకు గ్రెయిన్ కాలిపర్ పరికరాన్ని వినియోగించనున్నారు. నాణ్యతను కూడా ఈ పరికరం గుర్తిస్తోంది. ప్రమాణాలు పాటిస్తేనే ప్రభుత్వ బోనస్ అందనుంది.

నిర్ధారణే సమస్య

33 రకాల సన్నాలకు బోనస్ అందనుండటంతో ధాన్యం సేకరణలో సన్న రకాల నిర్ధారణ సవాలుగా మారింది. గింజ పొడవు 6 మిల్లీమీటర్లు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే తక్కువగా ఉండి.. పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 కన్న ఎక్కువ ఉండకుంటేనే బోనస్ ఇవ్వనున్నట్లు ఆంక్షలు పెట్టారు. తేమ శాతం ఉన్న ధాన్యంలో కొన్ని గింజల పొట్టు తీసి గ్రెయిన్ కాలిపర్ పరికరం సన్న, దొడ్డు రకాలుగా నిర్ధారణ తేల్చుతుంది. వ్యవసాయ శాఖ నిర్ధారిస్తేనే కొనుగోలు చేసి బోనస్ ఇవ్వనున్నారు.

వేర్వేరుగా సేకరణ

కేంద్రాల్లో ధాన్యాన్ని వేర్వేరు చోట్ల కొనుగోలు చేస్తారు. అనంతరం సన్నాలు, దొడ్డు రకం ధాన్యం గుర్తించేందుకు సంచులకు రెండు రకాల దారంతో కుట్టే విధానాన్ని పరిశీలిస్తున్నారు. సన్నాలు నిల్వ చేసిన సంచులను ఎరుపురంగు దారంతో కుట్టి.. వాటిపై 'ఎస్' అక్షరం రాస్తారు. దొడ్డు రకానికి పచ్చ రంగు దారం వాడతారు. మిల్లుల్లో వేర్వేరుగా వీటిని భద్రపరుస్తారు. సన్నాల నిర్ధారణలో రాజకీయ పలుకుబడికి తలొగ్గకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిబద్ధత పాటించాలి. అప్పుడే అర్హులైనా రైతులకు బోనస్ దక్కుతోంది.

ఉమ్మడి జిల్లాలో 6.06 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం, 3.76 లక్షల ఎకరాల్లో సన్న రకం సాగైంది.

జిల్లాల వారీగా వరి సాగు విస్తీర్ణం (ఎకరాలు లక్షల్లో..)

కరీంనగర్: 2.76
పెద్దపల్లి: 2.09
జగిత్యాల: 3.16
సిరిసిల్ల: 1.81

కేంద్రాలకు పరికరాలను సమకూరుస్తాం

- శ్యామ్‌ప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

సన్నాలకు బోనస్ చెల్లించడంలో నిర్ధారణ కీలకమైంది. ధాన్యం పరిమాణాన్ని నిర్ధారించేందుకు కొత్తగా గ్రెయిన్ కాలిపర్ పరికరాన్ని వాడనున్నాం. కేంద్రాలకు సరిపడా పరికరాలను సమకూర్చనున్నాం. సన్నాల కొనుగోళ్లలో సమస్యలు లేకుండా పర్యవేక్షణ చేస్తాం. నిబంధనలకు లోబడి ఉంటేనే బోనస్ రానుంది.

చిమ్మచీకటిలో ఈత చెట్టు కింద 15 గంటలు

ప్రమాదవశాత్తు పడి రాత్రంతా ఉండిపోయిన గీతకార్మికుడు


ఈత చెట్టు కింద నర్సయ్యగౌడ్

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కల్లు గీసేందుకు ఈత చెట్టు ఎక్కిన గీతకార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి 15 గంటల పాటు నరకయాతన అనుభవించిన ఘటన కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఏగోలపు నర్సయ్యగౌడ్ సోమవారం సాయంత్రం ఈత చెట్టుపై నుంచి కింద పడ్డారు. వెన్నెముక, ఇతర అవయవాలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టూ దట్టమైన చెట్ల పొదలుండటం, ఎవరూ చూడకపోవడంతో నర్సయ్యగౌడ్ లేవలేని స్థితిలో అక్కడే ఉండిపోయారు. భారీ వర్షం కురవడంతో తడుస్తూ అర్తనాదాలు చేసినా ఫలితం లేకపోయింది. భార్య సరమ్మ అల్లూరులో ఉంటున్న కొడుకు ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న నర్సయ్య ఇంటికి రాని విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. రాత్రంతా వర్షానికి తడిసి చలిలో, గాయాల బాధతో విలవిలలాడారు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో అటు వైపు వెళ్లిన గ్రామస్థులకు నర్సయ్యగౌడ్ అరుపులు వినిపించడంతో వెళ్లి చూశారు. గోదావరిఖని ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు, అనంతరం వరంగల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వెన్నెముక, పక్కటెముకలకు బలమైన గాయాలు కావడంతో నర్సయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఎమ్మెస్సీ గణితం ఫలితాలు విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత సెప్టెంబరులో నిర్వహించిన ఎమ్మెస్సీ గణితం(బ్యాక్‌లాగ్) రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా. శ్రీరంగప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in. లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

29 నుంచి బీఫార్మసీ పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే బీఫార్మసీ (సీబీసీఎస్) రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 29 నుంచి ప్రారంభమవుతున్నాయని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా. శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 30 నుంచి ప్రారంభమవుతున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గంగులకు మాతృ వియోగం

రాంపూర్(కరీంనగర్), న్యూస్‌టుడే: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తల్లి గంగుల లక్ష్మీనర్సమ్మ మంగళవారం ఉదయం కరీంనగర్‌లో మృతి చెందారు. దుబాయిలో ఉన్న కమలాకర్‌కు ఈ విషయం తెలియడంతో అక్కడి నుంచి బయలుదేరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మేయర్ వై.సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, భారాస నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు తదితరులు లక్ష్మీనర్సమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలు బుధవారం జరగనున్నాయి.


లక్ష్మీనర్సమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మేయర్ సునీల్‌రావు


లక్ష్మీనర్సమ్మ

మంత్రుల సంతాపం

ఆమె మృతికి మంత్రి శ్రీధర్‌బాబు, సియోల్ పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపాన్ని ప్రకటించారు. గంగుల లక్ష్మీనర్సమ్మ అకాల మరణం తమను కలిచి వేసిందన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటనలో సంతాపం తెలిపారు.

కుటుంబ సభ్యులకు కేసీఆర్ సానుభూతి

ఈనాడు, హైదరాబాద్ : గంగుల లక్ష్మీనర్సమ్మ మరణంపై మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ మంగళవారం సంతాపం ప్రకటించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. మాజీ మంత్రులు, కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డిలు కూడా సంతాపం తెలియజేశారు.

మూత్రశాలలు, మరుగుదొడ్లకు తాళాలు

రాజన్న భక్తులకు తిప్పలు

న్యూస్‌టుడే, వేములవాడ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లకు తాళాలు వేశారు. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు రూ.10 లక్షలు వెచ్చించి ఆలయ పార్కింగ్ స్థలంలో వీటిని నిర్మించారు. తరవాత వాటి నిర్వహణను ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో భక్తులు బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు పార్కింగ్ స్థలంలోని నల్లాల వద్ద స్నానాలు చేసి స్వామివారి దర్శనానికి వెళ్తున్నారు.



ఆలయ పార్కింగ్ స్థలంలో తాళం వేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లు


స్నానాల గదులదీ అదే పరిస్థితి

టెండరు పిలిచినా...

ఆలయ పార్కింగ్ స్థలంలో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో భక్తులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆలయ అధికారులు ఈ ఏడాది మార్చిలో టెండర్లు పిలిచి నిర్వహణ బాధ్యతలను ఓ సొసైటీకి అప్పగించారు. మొదట్లో వాటి నిర్వహణ సక్రమంగానే ఉన్నా తరవాత గాలికి వదిలేశారు. నిబంధనల ప్రకారం భక్తులు వచ్చినా, రాకున్నా వాటిని రోజూ తెరిచి ఉంచాలి. ముఖ్యంగా ఆది, సోమ, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారు. పార్కింగ్‌లోని మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు మూసి ఉంచడంతో భక్తుల బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా కంటెయినర్లు

మహా శివరాత్రి సందర్భంగా వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం మూత్రశాలలు, మరుగుదొడ్లకు సంబంధించిన కంటెయినర్లను లక్షలాది రూపాయలు వెచ్చించి పార్కింగ్ స్థలంలోని రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వాటిని వినియోగంలో ఉంచిన దాఖలాలు లేవు. వాటి నిర్వహణను కూడా పట్టించుకోలేదు. దీంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

పార్కింగ్ స్థలంలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులను తెరిచి ఉంచే విధంగా చర్యలు తీసుకుంటాం. టెండరు పిలిచి భక్తులకు ఇబ్బందులు లేకుండా వాటిని వినియోగంలోకి తీసుకొస్తాం. - **వరి నర్సయ్య, శానిటరీ విభాగం అధికారి, రాజన్న ఆలయం**

శ్రీరామసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద రాక కొనసాగింది. 26,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 4 స్పిల్‌వే గేట్ల ద్వారా 12,496 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాలువకు 5 వేలు, కాకతీయ కాలువకు 4 వేలు, ఇతర కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ కలుపుకొని ఔట్‌ఫ్లోను ఇన్‌ఫ్లోతో సమానంగా కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో 80.501 టీఎంసీల నీటి నిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నేడు జమ్మికుంట మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తినే ఈ కేంద్రంలో ఖరీదు చేస్తామన్నారు. నాణ్యత బట్టి ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 నుంచి రూ.7,220కు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. పత్తి పింజ పొడవును బట్టి మద్దతు ధరలో వ్యత్యాసాలు ఉంటాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, పాలకుర్తి

? మండలంలోని రాణాపూర్ గ్రామంలో గోపాలమిత్ర కేంద్రం సమీపంలో వీధి దీపం నిరంతరంగా వెలుగుతుంది. విద్యుత్తు వృథాను అరికట్టాలి. **-సాగర్, స్థానికుడు**

✔ పరిశీలించి పరిష్కరిస్తాం. **-వికాస్, పంచాయతీ కార్యదర్శి, రాణాపూర్**

న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

? కన్నాల గ్రామంలో పందులపల్లి మలుపు వద్ద చెట్లు పెరిగి, పాత రచ్చపల్లి వైపు రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనబడటం లేదు. ప్రమాదాలకు ఆస్కారమున్నందున చెట్లను తొలగించాలి. **-వాహనదారులు**

✔ రెండు రోజుల్లో చెట్లను తొలగిస్తాం. **-మధుకర్, కన్నాల పంచాయతీ కార్యదర్శి**

న్యూస్‌టుడే, ముత్తారం

? ముత్తారం మండలం రామకృష్టాపూర్‌లో గుంపులుగా కుక్కల సంచారంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గొర్రెలపై, కాపరులపై దాడికి పాల్పడుతున్నాయి. **-గ్రామస్థులు**

✔ గ్రామాల వారీగా సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తాం. **-ఎంపీడీవో నరేశ్**

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

? గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని వీధిలో గత కొంత కాలంగా కుళాయిల్లో మురుగు నీరు వస్తుంది. దుర్వాసన వస్తుంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. **-శ్రీనివాస్, గోదావరిఖని**

✔ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. తగు చర్యలు తీసుకుంటాం. **- శశికుమార్, నగరపాలక నీటి సరఫరా విభాగం పర్యవేక్షకులు.**

రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధి

ఓదెల, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల్లో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని శాసనసభ్యుడు విజయరమణారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో రోడ్ల విస్తరణకు మంగళవారం మార్కింగ్ పనులను పరిశీలించి ఆయన మాట్లాడారు. రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధే లక్ష్యంగా స్థానికుల సహకారంతో 36 ఫీట్లతో రోడ్డు వెడల్పు, డ్రైనేజీ పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఎంపీడీవో తిరుపతి, ప్యాక్స్ ఛైర్మన్ సుమన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఓదెలలో రోడ్ల విస్తరణకు మార్కింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

డిసెంబరు నాటికి నిధులు ఖర్చు చేయాలి

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ నిధులను డిసెంబరు నాటికి ఖర్చు చేయాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. మంగళవారం ఆయన సమీకృత పాలనా ప్రాంగణంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. వివిధ రకాల నిధులకు సరిపడా పెండింగ్ పనులు ప్రారంభించాలని సూచించారు. ఎక్కడైనా మిగిలిపోయిన పనులుంటే మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జడ్పీ సీఈవో నరేందర్, పీఆర్ ఈఈ గిరీశ్‌బాబు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: నగరంలోని పలు దుకాణాలపై రామగుండం నగరపాలక అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తున్న గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని మూడు కిరాణ దుకాణాలకు రూ.40 వేల జరిమానాలు విధించారు. సుమారు 70 కిలోల నిషేధిత ప్లాస్టిక్ క్యారీబ్యాగులు, గ్లాసులు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నగరపాలక ఆరోగ్య సహాయకులు కిరణ్‌కుమార్, పర్యావరణ ఇంజినీర్ మధూకర్‌తో పాటు శ్రావన్‌కుమార్, శ్రీకాంత్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఎక్కుతుండగా జారిపడి యువకుడి మృతి

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: రైలు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన వరంగల్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా పెద్దకల్వలకు చెందిన కల్వల వెంకటేశ్(33) వృత్తిపరమైన పనుల నిమిత్తం సోమవారం వరంగల్ వచ్చారు. తిరిగి వెళ్లేందుకు మంగళవారం తెల్లవారుజామున డోర్నకల్-కాజీపేట ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు యత్నించారు. ప్రమాదవశాత్తు రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో జారి పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి వద్ద లభించిన వివరాల ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.



వెంకటేశ్

ధాన్యం ట్రాక్టరు ఢీకొని ప్రైవేటు ఉద్యోగి దుర్మరణం



రవీందర్‌రెడ్డి

నేర వార్తలు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: ధాన్యం ట్రాక్టరు ఢీకొని ప్రైవేటు ఉద్యోగి దుర్మరణం చెందిన ఘటన సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై శ్రావణ్ కుమార్, స్థానికుల కథనం ప్రకారం ఎలిగేడు మండలం నారాయణరావుపల్లికి చెందిన కరివేద రవీందర్ రెడ్డి(38) కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. మంగళవారం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా కాట్నపల్లి సమీపంలో ఎదురుగా అపసవ్య దిశ(రాంగ్ రూట్)లో వస్తున్న ధాన్యం ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రవీందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. వారం రోజుల్లో ఎలిగేడు మండలానికి చెందిన కాంగ్రెస్ నేత గోదాల శ్రీనివాస్‌రెడ్డి, భారాస నాయకుడు గుర్రం మల్లారెడ్డి, ప్రైవేటు ఉద్యోగి కరివేద రవీందర్‌రెడ్డిలు రహదారి ప్రమాదంలో మృతి చెందడం స్థానికంగా విషాదం నింపింది.

అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం సీసాల పట్టివేత

పాలకుర్తి(రామగుండం), న్యూస్‌టుడే: రామగుండం రైల్వే స్టేషన్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న 200 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండం రైల్వేస్టేషన్‌లో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా బ్యాగుతో ఉండటాన్ని గమనించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా బ్యాగులో 200 దేశీదారు మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. అతన్ని మహారాష్ట్రలోని సిరొంచ మండలం వడ్డం గ్రామానికి చెందిన ఎర్కిచేతల రాజమల్లు పోచంగా గుర్తించినట్లు తెలిపారు. మహారాష్ట్ర నుంచి రైల్లో అక్రమ మద్యం సీసాలను తీసుకొని వచ్చి రామగుండం చుట్టుపక్క ప్రాంతాల్లో విక్రయించే క్రమంలో అతన్ని పట్టుకున్నట్లు వివరించారు. విచారణ నిమిత్తం రామగుండం పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

ప్రజా పంపిణీ బియ్యం ...

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం పోతారం గ్రామంలో మంగళవారం అక్రమంగా నిల్వ చేసిన దాదాపు ఆరు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రామగుండం టాస్స్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై నరేశ్‌ను సంప్రదించగా ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

మానేరుపై మరో వంతెన

రూపునారాయణపేట వద్ద నిర్మాణానికి రూ.80 కోట్లు మంజూరు

-న్యూస్‌టుడే, ఓదెల

మండలంలోని రూపునారాయణపేట.. జమ్మికుంటలోని విలాసాగర్ గ్రామాల మధ్యనున్న మానేరు వాగుపై రూ.80కోట్ల వ్యయంతో వారధి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఓదెల మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు జమ్మికుంట, హనుమకొండ, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు గుంపుల వంతెన నుంచి వెళ్లాల్సి వస్తోంది. నూతనంగా రూపునారాయణపేట వద్ద వంతెన నిర్మాణంతో.. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలకు జమ్మికుంట వైపుకు వెళ్లేందుకు 5 నుంచి 10 కిలోమీటర్ల మేర దూరం తగ్గనుంది.



రూపునారాయణపేటలో వంతెన నిర్మాణ ప్రతిపాదిత స్థలం

గ్రామం అభివృద్ధి చెందుతుంది



వంతెన లేకపోవడంతో రూపునారాయణపేట వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. శాసనసభ్యుడు విజయరమణారావుది ఇదే గ్రామం కావడంతో ఆయన చొరవతో ఇటీవల గ్రామానికి నూతనంగా బస్సు సర్వీసును ప్రారంభించుకున్నాం. మరోవైపు ఇందుర్తి వరకు రూ.2 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మరీ ముఖ్యంగా మానేరుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది. **అంకం రమేష్, మాజీ సర్పంచి రూపునారాయణపేట**

దూరం తగ్గించేందుకే నిర్మాణం

ప్రస్తుతం ఓదెల మండలంలోని గుండ్లపల్లె, కనగర్తి, మడక, పొత్కపల్లి, జీలకుంట, శానగొండ, కొమెర, నాంసానిపల్లె, కొలనూరు తదితర గ్రామాల ప్రజలు నిత్యం వ్యవసాయ, ఇతర వ్యాపార అవసరాలకు జమ్మికుంట, హుజూరాబాద్‌కు ప్రయాణిస్తుంటారు. దీంతో రూపునారాయణపేట వద్ద వంతెన నిర్మించి ప్రజలకు దూరాభారం తగ్గించాలనే ఆలోచన చాలాకాలం నుంచి నాలో ఉంది. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా.. నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. **విజయరమణారావు, ఎమ్మెల్యే**



మంథనిలో నివాళులర్పిస్తున్న భారాస నాయకులు

కుమురం భీం జయంతి

మంథని, న్యూస్‌టుడే: అడవి బిడ్డల హక్కుల కోసం 'జల్ జంగల్ జమీన్' నినాదంతో పోరాడిన కుమురం భీం జయంతిని పురస్కరించుకొని మంగళవారం మంథనిలో భారాస నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ గీట్ల జనార్దన్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని మంథని మార్కెట్ యార్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు శంకర్‌లాల్, పెగడ శ్రీనివాస్, కనవేన శ్రీనివాస్, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి: పెద్దబొంకూర్‌లో కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిట్టపల్లి శ్రీనివాస్, తగరం మల్లయ్య, నారాయణ, తిరుపతిగౌడ్, అవునూరి రాజయ్య, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు(సుల్తానాబాద్): ఎలిగేడు మండలకేంద్రంలో కుమురం భీం చిత్రపటానికి స్థానికులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పంచాయతీ కార్యదర్శి అంజలి, నాయకులు బింగి రాజు, పోచాలు, రాము, సంజీవ్, వినోద్ పాల్గొన్నారు.

శునకాలకు కు.ని. శస్త్రచికిత్సలు

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: సుదీర్ఘకాలం తర్వాత నగరంలో కుక్కల బెడద నియంత్రణకు రామగుండం నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. మల్కాపూర్ శివారులో కుక్కలకు 'కు.ని' శస్త్ర చికిత్స కేంద్రాన్ని పునఃప్రారంభించారు. నగరంలోని వివిధ కాలనీల్లో తిరుగుతున్న కుక్కలను ఇక్కడికి తరలించి కు.ని.శస్త్ర చికిత్సలు చేశారు. ఏకకాలంలో 50 కుక్కలను ఉంచేందుకు వీలుగా ప్రత్యేకంగా బోనులను ఏర్పాటు చేశారు. నగరంలో సుమారు నాలుగువేల వరకు వీధి కుక్కలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వాటికి కు.ని శస్త్ర చికిత్సలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. నాలుగు నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం రామగుండం ప్రాంతంలోని శునకాలనే కాకుండా పరిసర ప్రాంతాల్లో ఉన్న వాటిని సైతం పట్టుకొచ్చి శస్త్ర చికిత్సలు చేసిన అనంతరం వదిలేయనున్నట్లు వివరించారు.



మల్కాపూర్ శివారులోని కేంద్రంలో శస్త్ర చికిత్స చేస్తున్న దృశ్యం

రహదారిపై చెట్టు తొలగింపు

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం పారుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు నేలకొరిగింది. ఈ విషయాన్ని గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా ట్రాక్టరు సాయంతో తొలగించారు.

ట్రినిటీలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి ట్రినిటీ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ సబ్‌యూనిట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ మేరకు తెలంగాణ 9వ ఎన్‌సీసీ బెటాలియన్ కరీంనగర్ కమాండింగ్ అధికారి మేజర్ సాగర్‌సింగ్ అనుమతి పత్రాలను ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి అందజేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మమతారెడ్డి, కల్నల్ డేనియల్ లోట్మలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మార్కండేయకాలనీ, న్యూస్‌టుడే: గోదావరిఖని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జింక మల్లేశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు కనుకుంట్ల లక్ష్మణ్‌లు మంగళవారం తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించగా ఇందులో ఖని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పల్లె విజ్ఞేశ్వరి, ఇరికి చైతన్యశ్రీ, సుమయమిర్జా, రాజ్‌కుమార్, అజయ్‌సాగర్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 28, 29, 30వ తేదీల్లో జరిగే పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు.



క్రీడాకారులకు కప్‌లు అందజేస్తున్న దృశ్యం

జాతీయ స్థాయి క్రీడలకు...



ఆనంది

కమాన్‌పూర్: కమాన్‌పూర్‌కు చెందిన నల్లవెల్లి భారతి, శంకర్‌ల కుమార్తె ఆనంది జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఆమె ఈ నెల 25 నుంచి 29 వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న 39వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననుంది. ఆనందిని శిక్షకులు రమేశ్, రవీందర్, గ్రామస్థులు అభినందించారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డీసీపీ చేతన

శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

మంథని, న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని డీసీపీ చేతన ఆదేశించారు. మంగళవారం ఆమె మంథని ఠాణాను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి నేరాల వివరాలు తెలుసుకున్నారు. దొంగతనాలు, సైబర్ నేరాలను అరికట్టాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలపై ప్రజల్లో అవగాహన కలించాలన్నారు. ఏసీపీ రమేశ్, సీఐ రాజు, ఎస్సై రమేశ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

పెద్దపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ జాన్ నర్సింహులు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్దపల్లి మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గోదావరిఖని సింగరేణి క్రీడా మైదానంలో కబడ్డీతో పాటు బాల్‌బాడ్మింటన్ పోటీలను ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ ప్రారంభించారు. ఇందులో సింగరేణికి చెందిన అయిదు జట్లు పాల్గొన్నాయి. రామగుండం, బెల్లంపల్లి, కొత్తగూడెం రీజియన్‌కు చెందిన క్రీడాకారులు పాల్గొన్న పోటీలు ఆసక్తిగా సాగాయి. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని, క్రీడల ద్వారా స్నేహభావం పెరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు కె.స్వామి, సీఎంఓఏఐ ప్రతినిధి క్రాంతి, అధికారులు రామ్మోహన్, కిరణ్‌బాబు, సారంగపాణి, కుమారస్వామి, వసంత్‌కుమార్, వీరారెడ్డి, క్రీడా సూపర్‌వైజర్ రమేశ్, జాన్‌వెస్లీ, నరేందర్ రెడ్డి, అశోక్, పాషా, శ్రీనివాస్, సంతోష్‌రెడ్డిలు పాల్గొన్నారు.



ఓసీపీ-I ప్రాజెక్టు అధికారికి అవార్డు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సింగరేణి ఆర్జీ-3 డివిజన్‌లోని ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారి ఎన్.రాధాకృష్ణ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సతీష్‌చంద్రదుబే చేతుల మీదుగా 5స్టార్ రేటింగ్ అవార్డు అందుకున్నారు. సోమవారం రాత్రి దిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరాంతో కలిసి ఈ అవార్డును స్వీకరించారు. ఉపరితల గనుల నిర్వహణ, బొగ్గు ఉత్పత్తి, రవాణా, రక్షణ, కార్మికుల సంక్షేమం తదితర అంశాల్లో ఓసీపీ-1 ప్రాజెక్టు అగ్రస్థానంలో నిలవడంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు 5స్టార్ రేటింగ్ అవార్డును ప్రకటించింది. ప్రాజెక్టును అన్ని అంశాల్లో అగ్రస్థానంలో నిలిపిన పీవోను ఆర్జీ-3 జీఎంతోపాటు అన్ని విభాగాల అధికారులు యూనియన్ నాయకులు అభినందించారు.



సీఎండీ బలరాం చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న రాధాకృష్ణ

ఒకటో గనిని సందర్శించిన అధికారులు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి ఆర్జీ-1 ప్రాంతంలోని జీడీకే-1 గనిని కోల్ కంట్రోల్ అధికారులు మంగళవారం సందర్శించారు. సింగరేణి కార్పొరేట్ కోల్ కంట్రోల్ ఓఎస్‌డీ సుబ్రహ్మణ్యం, కోల్ ఇండియాకు చెందిన ఓఎస్‌డీ సతీష్‌గబియెల్‌లు ఒకటో గనిని సందర్శించి బొగ్గు ఉత్పత్తి పనులను పరిశీలించారు. రక్షణ చర్యలు ఏ విధంగా చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీఎం కార్యాలయంలో సుబ్రహ్మణ్యంతో పాటు సతీష్ గబియెల్‌లను జీఎం లలిత్‌కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు డి.వి.రావు, రామ్మోహన్, రమేశ్, ఆంజనేయప్రసాద్, రమేశ్, శంకర్, రామరాజు, కిరణ్‌బాబు, కర్ణ తదితరులున్నారు.

సంక్షిప్తం

■ నేడు నిట్టూరులో న్యాయ విజ్ఞాన సదస్సు

పెద్దపల్లి: పెద్దపల్లి మండలం నిట్టూరులో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవా సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి హేమంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

■ పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేయాలి

ఓదెల: మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. మండలంలోని ఆయా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్త సేకరణ, సెగ్రిగేషన్ షెడ్లను వినియోగించి కంపోస్ట్ తయారీకి కృషి చేయాలన్నారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో షబ్బీర్, ఏఈ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

■ నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలి

మంథని: విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా నిరంతర విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఎస్ఈ సుదర్శన్ సిబ్బందిని ఆదేశించారు. మంథనిలో మంగళవారం జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు బిల్లులు బకాయిలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. డీఈఈ ప్రభాకర్, టెక్నికల్ డీఈఈ రవి, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

■ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సుల్తానాబాద్: మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏసీపీ ఉపేందర్ సూచించారు. సుల్తానాబాద్‌లోని జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు మంగళవారం మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కలిపించారు. మత్తు పదార్థాలు వినియోగించినా. అమ్మకాలు జరిపిన టోల్‌ఫ్రీ నంబర్ 14446కు సమాచారం ఇవ్వాలన్నారు. సీఐ కృష్ణమూర్తి, ఎస్సై శ్రావణ్ కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

■ ఏఈగా బాధ్యతల స్వీకరణ

ముత్తారం: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా కీర్తన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నుండి నియామక పత్రాన్ని అందుకున్నారు. కాగా ఇక్కడ విధులు నిర్వహించిన ప్రణవ్ ధర్మారం మండలానికి బదిలీపై వెళ్లారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

■ రహదారి మంజూరుతో సంబరాలు

ఓదెల: మండలంలోని కనగర్తి నుంచి హరిపురానికి రూ.2కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కనగర్తిలో మంగళవారం రోడ్డు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు ప్రేంసాగర్‌రెడ్డి, ఐలయ్య, రవి, మహేందర్, రాజయ్య, శంకర్, చందు పాల్గొన్నారు.

■ విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ముత్తారం: దార్యపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుకి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని తీసివేసి మరొకటి ఏర్పాటు చేయాలని ఇటీవల జిల్లా కలెక్టర్ గ్రామంలో పర్యటించినప్పుడు గ్రామస్తులు వినతిపత్రాన్ని అందించారు. దీనిపై కలెక్టర్ శ్రీహర్ష అధికారులకు ఆదేశించగా.. ప్రమాదకరంగా మారిన స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి మంగళవారం ఏర్పాటుచేశారు. అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

■ పీఆర్సీని వెంటనే ప్రకటించండి

ధర్మారం: పెండింగ్ బిల్లులను చెల్లించడంతోపాటు పీఆర్సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామంలో ఈ తదితరులు పాల్గొన్నారు.

■ బీసీల రిజర్వేషన్‌లో వర్గీకరణ చేయండి

మంథని: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ.. తహసీల్దార్ రాజయ్యకు బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌జీ, సమ్మయ్య వినతిపత్రం అందించారు. అన్ని వర్గాలకు న్యాయం చేయాలని కోరారు.

■ చెక్కుల పంపిణీ

జూలపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 60 మందికి అందజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 70శాతం రైతులకు రుణమాఫీ చేశామన్నారు. తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీవో అనిల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

■ ఆయన నేత్రాలు సజీవం



ఓదెల: ఓదెలకు చెందిన మేర్గు శంకరయ్య(60) మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో ఉంటూ ప్రైవేటు ఎలక్ట్రిషియన్‌గా ఉపాధి పొందుతున్నారు. మంగళవారం ఆయన గుండెపోటుతో మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దానం చేశారు. ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి నేత్రదాత కుటుంబ సభ్యులను అభినందించారు.

■ అంబేడ్కర్ విగ్రహానికి వినతి

సుల్తానాబాద్: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, పింఛను మంజూరు చేయాలని కోరుతూ ఎలిగేడు మండల కేంద్రంలో మంగళవారం ఉద్యమకారుల సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు బింగి రాజు, పోచాలు, రాము, సంజీవ్, అనిల్ పాల్గొన్నారు.

■ బోరు పనులు ప్రారంభం

గోదావరిఖని: జనగామ గ్రామంలో సింగరేణి సహకారంతో బోరు పనులను మంగళవారం ప్రారంభించారు. గ్రామంలోని రజకులకు దోబీఘాట్ వద్ద నీటి సౌకర్యం కోసం గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు స్పందించి సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బోరు పనులు ప్రారంభించారు.

■ నవంబరు 5న సాహిత్య సదస్సు

గోదావరిఖని: గోదావరిఖని పట్టణంలో నవంబరు 5న సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నట్లు చైతన్య సాహితి సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధి ఎం.విజయానంద్ తెలిపారు. గోదావరిఖనిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గోదావరిఖని సిద్ధార్థ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న సదస్సుకు ఎమ్మెల్సీ, ప్రముఖ గాయకుడు, కవి దేశపతి శ్రీనివాస్, హైదరాబాద్ సిటీ కళాశాల తెలుగు డీన్ కోటేశ్వర్‌రావు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థిక సాయం

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలోని పూసాలలో నిరుపేద కుటుంబానికి చెందిన బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని వెంగళ హర్షిత చదువు కోసం మంగళవారం మండలంలో బియ్యం మిల్లుల గుమస్తాలు అండగా నిలిచారు. అందరూ కలిసి రూ.22,500 ఆర్థిక సాయం అందజేశారు. పట్టణానికి చెందిన తుమ్మ రాజ్‌కుమార్ రూ.5 వేలు అందించారు.



హర్షితకు నగదు అందజేస్తున్న మిల్లు గుమస్తాలు

■ సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరుపల్లి(ఫెర్టిలైజర్ సిటీ): గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన సతీమణి మనాలీఠాకూర్ అన్నారు. పాలకుర్తి మండలం గుంటూరుపల్లిలో మంగళవారం పర్యటించిన ఆమె స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

■ విద్యుదాఘాతంతో మేక మృతి

మంథని గ్రామీణం: ఉప్పట్లలో రేగళ్ల వెంకటికి చెందిన మేక మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. గోదావరి తీర ప్రాంతానికి మేతకు తీసుకెళ్లగా సమయంలో 11 కేవీ లైన్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. గతంలో ఇదే ప్రాంతంలో పశువు ఇలాగే విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది.

■ ఆలయ నిర్మాణానికి విరాళం

ఓదెల, న్యూస్‌టుడే: ఓదెలలో పోచమ్మ గుడి నిర్మాణానికి గోదావరిఖనిలో నివాసం ఉంటున్న మడ్డి ఎల్లయ్యగౌడ్ రూ.2.5 లక్షలు, పల్లెర్ల రాజేశం రూ.50 వేలు, మరో నలుగురు రూ.25 వేల చొప్పున విరాళాలు అందించినట్లు స్థానికులు తెలిపారు. చీకట్ల మొండయ్య, చిన్నస్వామి, ఎం.కుమారస్వామి, పచ్చిమట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

■ బస్సు సౌకర్యంపై మంత్రికి వినతి

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం మైదంబండ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం గ్రామస్థులు మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి ఆర్టీసీ గోదావరిఖని డిపో మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

■ సుల్తానాబాద్‌లో వైద్య శిబిరం

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పరిధిలోని యాదవనగర్, సుభాష్‌నగర్, శివాలయంవీధి ప్రజల కోసం మంగళవారం గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు అనుదీప్, సింధూజ రక్తపోటు, మధుమేహం, రక్తహీనత తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సిబ్బంది శంకర్, వెంకట్‌రెడ్డి, సరస్వతి, గౌస్ పాల్గొన్నారు.

■ సంఘాలు - నియామకాలు

ధర్మారం: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షునిగా చింతల తిరుపతి, ఉపాధ్యక్షునిగా మోతె అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా హనుమాన్‌సింగ్‌లను నియమించినట్లు ఫోరం ఛైర్మన్ శ్రీనివాస్ మంగళవారం ప్రకటించారు.